సాక్షి
అనంతపురం
మంగళవారం, 29, ఏప్రిల్, 2025



టన్ను చీనీ రూ.23,100

అనంతపురం మార్కెట్ యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23,100 వేలు ప్రకారం ధర పలికాయి.



9 నుంచి పెన్నహోబిలంలో బ్రహ్మోత్సవాలు

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు మే 9వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం
39.7°/21.5°

జిల్లాలో సోమవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

బీటెక్ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి సోమవారం విడుదల చేశారు. పరీక్షలు జరిగిన 15 రోజుల్లోనే ఫలితాల విడుదలకు కృషి చేసిన డిప్యూటీ కంట్రోలర్స్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కే. మాధవి, డాక్టర్ డి .లలిత కుమారి కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం పాలక మండలి సభ్యుడు ఎం. రామశేఖర్‌రెడ్డి, విభాగాధిపతులు టి.నారాయణరెడ్డి, జి.మమత, కళ్యాణ్‌కుమార్, అజిత, జరీనా పాల్గొన్నారు.

రూ.65 లక్షల పంట నష్టం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 21 మండలాల పరిధిలో 8.5 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఉరవకొండ 49.6 మి.మీ, రాయదుర్గం 38.6 మి.మీ, రాప్తాడు 30 మి.మీ, గుంతకల్లు 24.2 మి.మీ, కూడేరు 22.4 మి.మీ, యాడికి 19.4 మి.మీ, ఆత్మకూరు 18 మి.మీ, గార్లదిన్నె 13.8 మి.మీ మేర నమోదైంది. పామిడి, పెద్దపప్పూరు, బుక్కరాయసముద్రం, అనంతపురం, శెట్టూరు, గుమ్మఘట్ట, శింగనమల, విడపనకల్లు, గుత్తి, నార్పల, పెద్దవడుగూరు, కణేకల్లు తదితర మండలాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీయడంతో అక్కడక్కడా పంట నష్టం జరిగింది. అనంతపురం, తాడిపత్రి, గుమ్మఘట్ట, గుంతకల్లు మండలాల్లో 16 మంది రైతులకు చెందిన 11.70 హెక్టార్లలో అరటి దెబ్బతినడంతో రూ.48.60 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు ఉద్యానశాఖ అధికారులు అంచనా వేశారు. అలాగే గార్లదిన్నె మండలంలో 38 మంది రైతులకు చెందిన 25 హెక్టార్లు వరి నేలవాలడంతో రూ.15.50 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు అంచనా వేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

ఏడీసీసీబీ, డీసీఎంఎస్‌లకు నూతన చైర్మన్ల నియామకం




ముంటిమడుగు కేశవరెడ్డి, నెట్టెం వెంకటేశు

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్పొరేషన్‌లకు చైర్మన్‌లను నియమిస్తూ కూటమి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా గార్లదిన్నె మండలానికి చెందిన టీడీపీ నాయకుడు ముంటిమడుగు కేశవరెడ్డిని నియమించారు. అలాగే జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా కనగానపల్లి మండలానికి చెందిన టీడీపీ నాయకుడు నెట్టెం వెంకటేశును నియమించారు.

అసిస్టెంట్ కలెక్టర్‌గా సచిన్ రహర్ బాధ్యతలు



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు పూలమొక్క అందిస్తున్న సచిన్ రహర్

అనంతపురం అర్బన్: శిక్షణలో భాగంగా 2024 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సచిన్ రహర్‌కు అసిస్టెంట్ కలెక్టర్ హోదా ఇస్తూ ప్రభుత్వం జిల్లాకు కేటాయించింది. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి పూలమొక్క అందజేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ కలిశారు. రాజస్థాన్‌కు చెందిన సచిన్ రహర్ యూపీఎస్సీలో 291 ర్యాంక్ సాధించారు. పిలానిలోని బిర్లా పబ్లిక్ స్కూల్‌లో విద్యను అభ్యసించారు. ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని హిందూ కాలేజీలో బీఎస్సీ (ఫిజిక్స్) చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఎంఏ (జియోగ్రఫీ) చేశారు. బికనెర్‌లోని మహారాజ గంగా సింగ్ యూనివర్సిటీలో ఎంఏ చేశారు.

పెన్నాను చెరబట్టిన ఇసుకాసురులు

కూటమి నాయకుల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. సహజ వనరులను అందినకాడికి దోచేస్తూ జేబులు నింపుకుంటున్నారు. పెద్దవడుగూరు మండలంలో పెన్నానదిని చెరబట్టడంతో నదీతీరం గుంతలమయంగా మారింది. పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకాసురులు వాహనాల్లో ఇసుకను తరలిస్తున్నా అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.



చిట్టూరు వద్ద పెన్నానదిలో జేసీబీతో ఇసుకను ట్రాక్టర్‌లోకి నింపుతున్న దృశ్యం

- ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్న కూటమి నేతలు
- కళావిహీనంగా పెన్నానది పరివాహక ప్రాంతాలు
- నోరుమెదవని మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి
- అక్రమాలను చూసీ చూడనట్లు వదిలేస్తున్న అధికారులు



ఇసుక తరలింపుతో కొండూరు వద్ద బయటకు వచ్చిన బోరు కేసింగ్ పైపు



ఇసుక తవ్వకాలతో పెన్నానదిలో ఏర్పడిన గుంతల్లో నిలిచిన నీరు తాగుతున్న మూగజీవాలు

పెద్దవడుగూరు: పెన్నానది పరివాహక ప్రాంతాల్లో కూటమి నాయకులు ఇసుక దందాను జోరుగా సాగిస్తున్నారు. పెద్దవడుగూరు మండల పరిధిలోని పెన్నానది పరివాహక ప్రాంతాలైన కొండూరు, పి.వీరన్నపల్లి, చిట్టూరు, చిత్రచేడు గ్రామాల సమీపంలో ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వేస్తున్నారు. అక్కడే జేసీబీలను ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వారా నిరంతరం ఇసుకను తరలిస్తూ రూ.లక్షలు వెనుకేసుకుంటున్నారు.

అడ్డదిడ్డంగా తవ్వకాలు

ఇప్పటికే మండలంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక, మట్టి తరలింపు ఇలాగే కొనసాగితే మండలంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు ఉన్నాయంటున్నారు. కొండూరు, చిత్రచేడు గ్రామాల సమీపంలో పండ్ల తోటలు సాగు చేసుకున్న రైతులు బోర్లు వేసుకోగా ఇసుకాసురులు బోర్లు ఉన్న ప్రాంతాలను కూడా వదలక పోవడంతో కేసింగ్ పైపులు పైకి కనిపిస్తున్నాయి. కొండూరు పెన్నానది ఒడ్డున ఉన్న శ్మశాన వాటిక ప్రాంతంలోనూ తవ్వకాలు చేస్తుండటంతో మృతదేహాలు బయటకు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు.

నోరుమెదపరేం జేసీ..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇసుక అక్రమ తరలింపుపై ఘాటుగానే స్పందించారు. తనవారైనా ఇసుకను తరలిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం మండలంలో అధిక శాతం ఆయన అనుచరులే ఇసుక, మట్టి దందాలు చేస్తున్నా ఆయన ఎందుకు మిన్నకుండిపోతున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

పెన్నానది పరివాహక ప్రాంతాల్లో ఇసుకను యథేచ్ఛగా దోచేస్తున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ట్రాక్టర్లు విపరీతంగా ఇసుకను, మట్టిని తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఏవైనా అభివృద్ధి పనులకు మాత్రమే అవసరమైన మట్టికి, ఇసుకకు అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. అయితే అవేవీ లేకుండానే కూటమి నాయకులు గుత్తి, పామిడి పట్టణాల్లోని వెంచర్లలోకి మట్టిని కూడా భారీగా తరలిస్తున్నారు. అధికారులకు అన్నీ తెలిసినా ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు.

అనుమతులు ఇవ్వలేదు



మండలంలో ఇసుక, మట్టి తరలింపునకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. ఒకవేళ ఎవరైనా ఇసుకను తరలించాలని అనుకుంటే మైన్స్ అండ్ జియాలజీ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవు.
– ఉషారాణి, తహసీల్దార్, పెద్దవడుగూరు

తెలంగాణ సీఎస్‌గా గుత్తి వాసి రామకృష్ణారావు



గుత్తి: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా గుత్తికి చెందిన రామకృష్ణారావు నియమితులయ్యారు. రామకృష్ణారావు తండ్రి గురునాథ్‌రావు, తల్లి భాగ్యలక్ష్మి. తండ్రి గురునాథ్ రావుది గుత్తిలోని కోట. తల్లిది నంద్యాల జిల్లా పాణ్యం. రామకృష్ణారావుకు కుమారుడు , కుమార్తె ఉన్నారు. కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. కుమార్తె ఢిల్లీలో న్యాయవాదిగా పని చేస్తున్నారు. రామకృష్ణారావు తాత చంద్రమౌళీశ్వరరావు స్వాతంత్ర్య సమర యోధుడు. రామకృష్ణారావుకు గుత్తిలో ఇల్లుతో పాటు భూమి కూడా ఉంది. ఇంటిని వేరే వారికి విక్రయించినట్లు తెలుస్తోంది. రామకృష్ణారావు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ గుత్తి కోటలోని 8వ వార్డు స్కూల్లో చదువుకున్నారు. అనంతరం కొడిగెనహళ్లిలో 6 నుంచి 10వ తరగతి వరకు, నాగార్జున సాగర్‌లో ఇంటర్, కాన్పూర్ ఐఐటీలో బీటెక్, ఢిల్లీ ఐఐటీలో ఎంటెక్, డ్యూక్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ పూర్తి చేశారు. 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావు అంచెలంచెలుగా ఎదిగారు. తెలంగాణ (హైదరాబాద్)లో సెటిల్ అయ్యారు. తెలంగాణ ఆర్థికశాఖ కార్యదర్శిగా కూడా పని చేశారు. రామకృష్ణారావు తెలంగాణ సీఎస్‌గా ఎంపిక కావడంతో గుత్తి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డిగ్రీ పరీక్ష తేదీ మార్పు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో మే 7వ తేదీన నిర్వహించాల్సిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు జూన్ 4న నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ తెలిపారు. ఏపీ ఐసెట్ పరీక్ష కారణంగా పరీక్షల షెడ్యూల్ మార్పు చేశామని పేర్కొన్నారు.

- బీఈడీ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులు డీబార్ చేసినట్లు రమణ తెలిపారు. తాడిపత్రిలోని జేసీఎన్‌ఆర్ కళాశాలలో బుక్ చేశామని తెలిపారు.

పరిష్కార వేదికకు అర్జీల వెల్లువ

- వివిధ సమస్యలపై 445 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లా కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలు వెల్లువెత్తాయి. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 445 వినతులు అందాయి. ప్రజల నుంచి కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, రామ్మోహన్, తిప్పేనాయక్ అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి సమస్యకు అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు.

వినతులు కొన్ని...

- పుట్లూరు మండల కేంద్రానికి చెందిన కె.నాగలక్ష్మి నడవలేనిస్థితి. ఆమెను బంధువులు ఆటోలో కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. ఈమెకు వైకల్యం సున్నా శాతం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్ ఇవ్వడంతో పింఛన్ రాలేదు. అర్జీ పెట్టుకుంటే 15 రోజుల్లో సర్టిఫికెట్ ఇస్తామన్నారని, రెండేళ్లు గడుస్తున్నా సర్టిఫికెట్ ఇవ్వలేదని నాగలక్ష్మి కలెక్టర్‌కు విన్నవించుకుంది.
- ఏళ్లగా సాగు చేసుకుంటున్న భూమి పట్టా ఇవ్వాలని రాప్తాడు మండలం ఎర్రగుంట గ్రామానికి చెందిన టి.నారాయణమ్మ విన్నవించింది. గ్రామ పొలం సర్వే నెంబరు 127లో 1.62 ఎకరాల భూమిని 30 ఏళ్లగా సాగు చేసుకుంటున్నాని చెప్పింది. తాను సాగు చేసుకుంటున్న విషయం వాస్తవమేనంటూ 2016లో అప్పటి తహసీల్దారు నిర్ధారిస్తూ తదుపరి భూ పంపిణీలో ఇస్తామని ఎండార్స్‌మెంట్ ఇచ్చారని చెప్పింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆర్‌డీఓ, కలెక్టర్ కార్యాలయాల్లో అర్జీ ఇస్తూనే ఉన్నానని, అయితే ఇప్పటి వరకు తనకు పట్టా ఇవ్వలేదని వాపోయింది.

పురుగుల మందు డబ్బాతో..

ఏళ్లగా తిరుగుతున్నా.. ఇప్పటికైనా నా సమస్య పరిష్కరించండి. లేదంటే ఇక్కడే ప్రాణాలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నానంటూ ఆత్మకూరు మండలం మదిగుబ్బకు చెందిన ఎస్.గోపాల్ విషయాన్ని అర్జీలో రాసి కలెక్టర్‌కు ఇచ్చారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బాధితుడి వద్దకు జాయింట్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ స్వయంగా వచ్చి అతని అర్జీని పరిశీలించాడు. సర్వే నెంబరు 136/6లో 1.24 ఎకరాలు మిగులుభూమిని గోపాల్ సాగు చేసుకుంటున్నాడు. ఈ భూమిని వేరొకరి పేరున 2022లో ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అప్పటి నుంచి ఎన్ని అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. వివరాలతో పాటు "ఈ రోజు ఇక్కడ న్యాయం జరగలేదు... నాకు అన్యాయం జరిగింది. ఇక్కడే ప్రాణాలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాను." అంటూ అర్జీలోనే రాసి సమర్పించాడు. తన పాటు పురుగుల మందు డబ్బా తీసుకొచ్చాడు. గుర్తించిన పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పక్కాగా ప్లాస్టిక్ నిషేధం అమలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: నగరంతో పాటు అన్ని మున్సిపాలిటీల్లోనూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్‌తో కలిసి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్లాస్టిక్ నిషేధం అమలుకు సంబంధించి పట్టణాల్లో వార్డుస్థాయి కమిటీలను 24 గంటల్లోపు నియమించాలన్నారు. నగరంలో 56 ట్రేడర్స్‌ని ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది నిరంతరం తనిఖీ చేయాలన్నారు.

- ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ప్రతి రోజు 1.05 లక్షల మందికి పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకంపై కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. డ్వామా పీడీ సలీమ్‌బాషా, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.
- జిల్లాలో విండ్ పవర్ ప్రాజెక్టు, ఏపీ జెన్‌కో, రిలయన్స్ బయోగ్యాస్, ఎంఎస్‌ఎంఈ పార్కులు, డంపింగ్ యార్డ్, కమ్యూనిటీ భవనాలు, 4జీ మొబైల్, డీఎల్‌డీఓ కార్యాలయం, తదితర ప్రాజెక్టులకు భూ బదలాయింపు, భూమి అప్పగింతకు సంబంధించి పెండింగ్ ప్రతిపాదనలు పంపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భూ బదలాయింపు అంశంపై సోమవారం కలెక్టరేట్‌లో జేసీతో కలిసి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

పోషించలేను.. మీరే భవిష్యత్ ఇవ్వండి !



అనంతపురం: సార్ .. నా కూతురిని నేను పోషించలేను. మీరే నా కూతురికి ఒక మంచి జీవితం ఇవ్వాలని కోరుతున్నా. మీ దగ్గరే వదిలి వెళ్లిపోతున్నాను. తన జీవితం బాగుండాలని వేడుకుంటున్నాను. నేను చనిపోతున్నా. నా కూతురిని బాగా చూసుకోండి ప్లీజ్. ఒక తల్లిగా ఇది నా ఆవేదన' అంటూ లెటర్ రాసిన ఓ తల్లి వారం వయస్సు కలిగిన ఆడ శిశువును అనాథగా వదిలి వెళ్లిపోయింది. ఈ సంఘటన అనంతపురంలోని విజయనగర్ కాలనీలో సోమవారం రాత్రి 10 గంటలకు వెలుగులోకి వచ్చింది. నవజాత శిశువుకు గౌను వేసి చూడముచ్చటగా తీర్చిదిద్దిన తల్లి బిడ్డను అనాథగా వదిలివెళ్లడం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. శిశువు ఏడుపు విని అటువైపు వెళ్తున్న వారు గమనించి ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. ఐసీపీఎస్ ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి, సూపర్‌వైజర్ నవీన్, ఆశా వర్కర్ గౌరి ఘటనా స్థలానికి వెళ్లారు. శిశువును అక్కున చేర్చుకొని ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడి నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. అయితే ఆ పసికందు తల్లి తన ఆవేదనను లేఖలో రాసి అక్కడ ఉంచడం ప్రతి ఒక్కరినీ కలచివేసింది.

54,184 క్వింటాళ్లతో ఖరీఫ్ విత్తన ప్రణాళిక

- 50,592 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీకి అనుమతులు



విత్తన వేరుశనగ

అనంతపురం అగ్రికల్చర్: జూన్ నుంచి ప్రారంభం కానున్న ఖరీఫ్‌లో రైతులకు రాయితీతో 54,184 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ జేడీ కార్యాలయం ఒక ప్రకటన ద్వారా తెలియజేసింది. విత్తన వేరుశనగ 50,592 క్వింటాళ్లు పంపిణీకి అనుమతులు వచ్చినట్లు తెలిపారు. 2,380 క్వింటాళ్ల కందులు, 800 క్వింటాళ్ల విత్తన వరి, 207 క్వింటాళ్ల జీలుగు, జనుము, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు, 60 క్వింటాళ్ల పెసర, 60 క్వింటాళ్లు అలసందలు, 36 క్వింటాళ్ల మినుములు, 45 క్వింటాళ్ల కొర్రలు, 4 క్వింటాళ్ల రాగులు పంపిణీకి కమిషనరేట్ నుంచి అనుమతులు జారీ అయినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీతో పంపిణీకి ధరలు ఖరారైనట్లు తెలిపారు. మే మొదటి వారంలో మిగతా విత్తన ధరలు, రాయితీలు ప్రకటించగానే విత్తన సేకరణ, సరఫరా, పంపిణీ ప్రక్రియ మొదలు పెట్టనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థిని ఆత్మహత్య



మృతురాలు స్వాతి

కణేకల్లు: పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ కావడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన మేరకు... కణేకల్లు మండలం కె.కొత్తపల్లికి చెందిన గౌరమ్మ, పోతన్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరి పెద్ద కుమార్తె స్వాతి (15) కణేకల్లులోని కేజీబీవీలో చదివిస్తున్నారు. ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షల్లో తన సహ విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కాగా, స్వాతి మాత్రం ఒక్క సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయింది. కష్టపడి చదివినా ఒక సబ్జెక్ట్‌తో ఫెయిలయ్యాననే బాధలో మానసికంగా కుదేలైన ఆమె.. ఆదివారం ఉదయం కుటుంబసభ్యులందరూ చర్చికి వెళ్లిన సమయంలో మధ్యాహ్నం 1 గంటకు ఇంట్లో ఒంటరిగా ఉన్న స్వాతి తన చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చర్చి నుంచి ఇంటికొచ్చిన తల్లిదండ్రులు విగతజీవిగా ఉరికి వేలాడుతున్న కుమార్తెను చూసి బోరుమని విలపించారు. ఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వృద్ధురాలి బలవన్మరణం

తాడిపత్రి: మండలంలోని వంగనూరు – చల్లవారిపల్లి రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం ఉదయం ఓ వృద్ధురాలు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. సుమారు 60 సంవత్సరాల వయస్సు ఉంటుందని అంచనా వేశారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దీంతో గుర్తు తెలియని వృద్ధురాలి ఆత్మహత్యగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైన ఇంటర్, పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన జిల్లాలోని రజక సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు రజక ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు సి.ఎర్రిస్వామి, ఆనంద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతిలో 450 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు, ఇంటర్‌లో 650 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు అర్హులు. బయోడేటాతో పాటు మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం జతచేసి మే 20వ తేదీలోపు సి.ఎర్రిస్వామి, టీచర్, 1-1-284, ఆర్కేనగర్, అనంతపురం చిరునామాకు దరఖాస్తులు పంపాలి. పూర్తి వివరాలకు 98668 76190, 91107 00830, 83412 44333, 80966 88896లో సంప్రదించవచ్చు.

ఆర్డీటీ పరిరక్షణకు ఎందాకైనా..

- పేదలతో కలసి పార్టీలకతీతంగా ఐక్య పోరాటాలకు సిద్ధం
- ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ పునరుద్ధరించాలని డిమాండ్



సంఘీభావం తెలుపుతున్న ప్రజా, కుల, అఖిలపక్షం నేతలు

అనంతపురం సిటీ: దళిత, గిరిజన వర్గాలతో పాటు మహిళలు, విద్యార్థులు, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ) సంస్థకు విదేశీ నిధులు అందేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా ఆర్డీటీ పరిరక్షణకు ఉద్యమిస్తామి స్తామంటూ ముక్తకంఠంతో నినదించారు. ఆర్డీటీకి అందుతున్న విదేశీ నిధులపై విధించిన ఆంక్షలపై నిరసిస్తూ, ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ అంశంపై చేపట్టాల్సిన భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై అనంతపురంలోని జిల్లా పరిషత్ క్యాంపస్‌లో గల డీపీఆర్‌సీ భవన్‌లో సోమవారం సదస్సు జరిగింది. సీపీఐ నేత డి.జగదీష్ అధ్యక్షత వహించగా, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అనంతపురం, హిందూపురం ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, కంబదూరు జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు, వీకే ట్రస్ట్ చైర్మన్ వీకే రంగారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రతినిధి నాగరాజు, మానవ హక్కుల ప్రతినిధి బాషా, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, రైతు సంఘం ప్రతినిధి కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధి కేశవరెడ్డి, అనంతపురం రూరల్ మాజీ ఎంపీపీ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ సహా పలు ప్రజా, కుల సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా..

దుర్భిక్ష ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు ఏపీ, తెలంగాణ ప్రాంతాల్లో ప్రభుత్వాలు చేయలేని ఎన్నో విలువైన సేవలను నిస్వార్థంతో ఆర్డీటీ చేసిందని, ప్రత్యామ్నాయ ప్రభుత్వంగా ఆర్డీటీకి గుర్తింపు ఉందని వక్తలు అన్నారు. స్పానిష్ ఆర్మీలో సైనికుడిగా పని చేసిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ మానవత్వానికి హద్దుల్లేవని నిరూపించారన్నారు. తన నిస్వార్థ సేవలతో ఎస్సీ, ఎస్టీలతో పాటు సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, దళిత, గిరిజన వాడల అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. విద్య, వైద్యం అందించడంతో పాటు ప్రజలను సామాజికంగా, ఆర్థికంగా బలోపేతమయ్యేలా చైతన్యం తీసుకురావడంలో ఆయన సఫలీకృతులయ్యారని కొనియాడారు. ఆయన మరణానంతరం కూడా సతీమణి అన్నే ఫెర్రర్, కుమారుడు మాంఛో ఫెర్రర్, కోడలు విశా ఫెర్రర్ సామాజిక సేవలను కొనసాగిస్తుండడం, మరిన్ని ప్రాంతాలకు విస్తరించడం గర్వంగా ఉందన్నారు. లక్షలాది మంది ప్రజల జీవితాలతో ముడి పడిపోయిన ఆర్డీటీకి ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్(ఎఫ్‌సీఆర్‌ఏ) రిజిస్ట్రేషన్ పునరుద్ధరించకపోతే నష్టపోయేది పేదలేనని ఆందోళన వ్యక్తం చేశారు.

ఏ పోరాటానికైనా సిద్ధం



“ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో నిస్వార్థ సేవలందిస్తూ నిరుపేదల జీవితాల్లో అంతర్భాగమైన ఆర్డీటీ మనుగడ ప్రస్తుతం ప్రమాదంలో పడింది. ప్రభుత్వాలు చేయలేని ఎన్నో మంచి పనులను ఆర్డీటీ చేసి చూపించింది. అలాంటి సంస్థ కోసం పార్టీలకతీతంగా పేదలతో కలసి ఐక్య పోరాటాలకు సిద్ధం, ఆర్డీటీని కాపాడుకోవడమే లక్ష్యం.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్, అనంతపురం

మానవత్వంతో ఆలోచించాలి



కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా సేవలందిస్తున్న ఆర్డీటీకి అందరూ అండగా నిలవాలి. 1969 నుంచి ఇప్పటి వరకూ దళిత, గిరిజనులతో పాటు మహిళలు, విద్యార్థుల అభ్యున్నతికి ఆర్డీటీ దోహదపడుతూ వస్తోంది. వెనుకబడిన ప్రాంతాలకు వరదాయినిగా మారిన ఆర్డీటీ ఉనికి ప్రశ్నార్థకం కాకూడదు. నిధులు అందేలా కేంద్రం చొరవ తీసుకోవాలి.

– విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ

ప్రజల జీవనాడి ఆర్డీటీ



అనంత జిల్లా ప్రజల జీవనాడిగా ఆర్డీటీ మారిపోయింది. 1969లో స్థాపించిన ఈ సంస్థ 1970 నుంచి విస్తృతమైన సేవలందిస్తోంది. కరోనా సమయంలో ఆ సంస్థ అందించిన సేవలను ఏ ఒక్కరూ జీవితంలో మరచిపోలేరు. ఆర్డీటీపై దుష్ప్రచారం తగదు. పేదల జీవనోపాధుల మెరుగు కోసం ఆర్డీటీకి అండగా నిలవాలి.

– ఓ.నల్లప్ప, సీపీఎం జిల్లా కార్యదర్శి, అనంతపురం

అండగా నిలబడాలి



ఆర్డీటీని కాపాడుకునేందుకు ప్రజలందరితో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఎమ్మెల్యేలు, ఎంపీలు కలసి రావాలి. జిల్లాలో ప్రత్యామ్నాయ ప్రభుత్వంగా ఎంతో మంది జీవితాలను నిలబెట్టిన ఆర్డీటీకి అండగా నిలవాల్సిన తరుణమిదే. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. ఆర్డీటీకి నిధులు అందేలా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– వీకే రంగారెడ్డి, వీకే ట్రస్ట్ చైర్మన్, అనంతపురం

చొరవ తీసుకుంటాం



ఉమ్మడి అనంత జిల్లాతో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో లక్షలాది మంది జీవనోపాధులకు ఊపిరి పోసిన ఆర్డీటీ పరిస్థితి ఇప్పుడు ప్రమాదంలో పడింది. వారంలోపు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలసి పరిస్థితి వివరించి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాను ఒప్పించి ఆర్డీటీకి నిధులు అందేలా చొరవ తీసుకుంటాం.

– అంబికా లక్ష్మీనారాయణ, ఎంపీ, అనంతపురం

మే 1న సీఎంను కలుస్తాం



వచ్చే నెల ఒకటిన సీఎం చంద్రబాబును కలసి ఆర్డీటీ పరిస్థితిని వివరిస్తాం. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా చొరవ తీసుకుంటాం. అవసరమైతే పార్లమెంట్‌లో కూడా ఈ అంశాన్ని ప్రస్తావించి ఆర్డీటీకి నిధులు అందేలా ఒత్తిడి పెంచుతాం. పార్టీలకతీతంగా ఆర్డీటీని కాపాడుకోవాల్సిన సమయం ఇది.

– బీకే పార్థసారథి, ఎంపీ, హిందూపురం

సీఎం స్పందించాలి



జిల్లాలో ఆర్డీటీ అందిస్తున్న సేవలు సీఎం చంద్రబాబుకు తెలియనివి కాదు. విదేశీ నిధులు అందకుండా ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయడం సరికాదు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు గమనించి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాతో చర్చించి ఆర్డీటీకి నిధులు ఆగిపోకుండా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలి.

– డి.జగదీష్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు

9 నుంచి పెన్నహోబిలంలో బ్రహ్మోత్సవాలు

ఉరవకొండ రూరల్: జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు మే 9వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. ఇందులో భాగంగానే సోమవారం ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీస్వామి, ఆలయ కమిటీ సభ్యుల చేతుల మీదుగా విడుదల చేశారు. ఆలయ ఈఓ రమేష్‌బాబు మాట్లాడుతూ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవాలు మే 9 నుంచి 20 వరకూ జరుగుతాయన్నారు. 9న ఆమిద్యాల నుంచి శ్రీవారి ఉత్సవమూర్తులు పెన్నహోబిలం చేరతాయన్నారు. 10న అంకుర్పారణ, 11న సింహ, చంద్రప్రభ వాహనోత్సవాలు, 12న గోవాహనం, శేషవాహనం, 13న హంస వాహనోత్సవం, 14న హనమంత, 15న గరుడ వాహనోత్సవం, శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 16న సూర్యప్రభ, ఐరావత వాహనం, 17న మహా రథోత్సవం, 18న అశ్వవాహనం, 19న ధ్వజారోహణం, 20న శ్రీవారి ఉత్సమూర్తులను ఆమిద్యాలకు ఊరేగింపుగా తరలించడంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు ఎంపిక

- ఉత్తర్వులు జారీ చేసిన పార్టీ కేంద్ర కార్యాలయం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల్లో కొందరికి అవకాశం కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. యువజన విభాగం ఉపాధ్యక్షులుగా గోచెర్ల ప్రతాప్ (కళ్యాణదుర్గం), దాదాఖలందర్(అనంతపురం), జిల్లా ప్రధాన కార్యదర్శులుగా ఉప్పలూరి లోకనాథరెడ్డి(అనంతపురం), కె.సురేష్‌బాబు (ఉరవకొండ), చుక్కల సూరి (గుంతకల్లు), బోయ శ్రీకాంత్ (కళ్యాణదుర్గం), ఎం.సురేష్(రాయదుర్గం), కార్యదర్శులుగా ఎస్.రామమోహన్ రెడ్డి (తాడిపత్రి), మందల కృష్ణ (రాయదుర్గం), ఎంఎస్ హిదయాతుల్లా, షేక్ నూర్‌బాషా (అనంతపురం), కుమ్మెత రాజశేఖరరెడ్డి (గుంతకల్లు), మనోవిశ్వాస్ రెడ్డి (ఉరవకొండ), గువ్వల సాయికృష్ణ, ముల్లా పెద్దిరెడ్డి (శింగనమల), బోయకట్టా శివప్రసాద్ (గుంతకల్లు), ఎం.మంజునాథ్ (రాయదుర్గం), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మణికంఠ, బి.జగదీష్‌బాబు, సి.హేమకిరణ్ (అనంతపురం), సోహైల్ తన్వీర్ (శింగనమల), హెచ్.బాబు (కళ్యాణదుర్గం), పింజిరి ఖలందర్, డి.రఘు (రాయదుర్గం), బి.కుళ్లాయప్ప, ఎం.బాలిరెడ్డి, బిల్లే గోపీ యాదవ్, అంకె ఆనంద్, ఎన్.నరసింహారెడ్డి (శింగనమల), టి.సందీప్ రెడ్డి (ఉరవకొండ), పి.ఆదిశంకర్‌గౌడ్ (తాడిపత్రి), కె.రమణ (గుంతకల్లు)కు అవకాశం కల్పించారు.

- జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా మేరి నిర్మల (ఉరవకొండ), మందల లక్ష్మీకాంతమ్మ (కళ్యాణదుర్గం), నోసం సుజాత (అనంతపురం), ప్రధాన కార్యదర్శులుగా బీమిరెడ్డి సుహాసిని, కరణం ఉమామహేశ్వరి, అంజలి (అనంతపురం), సి.నాగమణి (గుంతకల్లు), తప్పాల రిజ్వానా (కళ్యాణదుర్గం), కార్యదర్శులుగా జి.కమలాక్షి (తాడిపత్రి), ముదిలియార్ భారతి (అనంతపురం), బి.కమలమ్మ (ఉరకొండ), దూతూరి అనురాధ (రాయదుర్గం).
- జిల్లా మైనార్టీ విభాగం ఉపాధ్యక్షులుగా బ్యాచ్‌కర్ రుక్మాన్ (గుంతకల్లు), శింగనమల ఉస్మాన్ (ఉరవకొండ), ప్రధాన కార్యదర్శులుగా నల్లబండ బాబా షంషుద్దీన్, షేక్ బుడేన్, షేక్ ఖాజావలి (అనంతపురం), ఎ.రియాజ్‌బాషా(తాడిపత్రి), టి.బషీర్ అహ్మద్ (రాయదుర్గం), రాములకట్ల ఇబ్రహీం (కళ్యాణదుర్గం), కార్యదర్శులుగా బళ్లారి ఆసీఫ్ (ఉరవకొండ), ముస్లిం ఇమామ్ వలి (కళ్యాణదుర్గం), హాజీ మలాగ్ బాబా (గుంతకల్లు), షేక్ ఖాదర్ బాషా (అనంతపురం), వై మహమ్మద్ ఫయాజ్, షేక్ అన్వర్ బాషా (గుంతకల్లు).
- జిల్లా మునిసిపల్ విభాగం అధ్యక్షుడిగా బోయ సుంకప్ప (గుంతకల్లు), ఉపాధ్యక్షులుగా జి.సూర్యప్రభాకర్ (తాడిపత్రి), వెంకటసుబ్బయ్య పసువుల (అనంతపురం), వెలుగు నాగరాజు యాదవ్ (కళ్యాణదుర్గం), ప్రధాన కార్యదర్శులుగా ఎం. దివ్య (కళ్యాణదుర్గం), కాశీ శ్రీనివాసులు, ఆకుల మునిశంకయ్య, కమల్‌భూషణ్, కె.అనిల్‌కుమార్‌రెడ్డి (అనంతపురం), కార్యదర్శులుగా వడ్డే మల్లెల రామచంద్ర, అంకిరెడ్డి ప్రమీల (అనంతపురం), బట్నపాడు సుంకప్ప (గుంతకల్లు)కు అవకాశం కల్పించారు.

పరిష్కారం చూపకపోతే సమ్మె తప్పదు

- ఎన్‌ఎంయూ హెచ్చరిక



దీక్షలో పాల్గొన్న ఎన్‌ఎంయూ నేతలు

అనంతపురం క్రైం: ఆర్టీసీ కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపకపోతే సమ్మె తప్పదని ప్రభుత్వాన్ని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సూరిబాబు హెచ్చరించారు. డిమాండ్ల సాధనలో భాగంగా సోమవారం ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో అనంతపురం డిపో ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత కల్పిస్తూ 1-2009 విడుదల చేసిన సర్క్యులర్‌ని అన్ని డిపోల్లో అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కింది స్థాయి ఉద్యోగులు, కార్మికులపై అధికారులు కక్షపూరితంగా వేటు వేస్తున్నారని, తక్షణమే అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలన్నారు. తక్షణం పదోన్నతులు కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ, సెలవులు మంజూరు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని అమలు చేయాలన్నారు. నైట్ సిఫ్ట్ అలవెన్సులను రూ.150 నుంచి 114 జీఓలో పొందుపరిచిన మేరకు రూ.400కు పెంచాలన్నారు. డిమాండ్లు నెరవేర్చకపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు. రిలే నిరాహార దీక్షల్లో డ్రైవరు మద్దిలేటి, కేకే రావు, శ్రీనివాసులు, శ్రీనివాసులు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హౌస్ వైరింగ్‌పై ‘రూడ్‌సెట్’లో ఉచిత శిక్షణ

అనంతపురం: ఎస్కేయూ సమీపంలోని రూడ్‌సెట్ సంస్థలో మే 6 నుంచి జూన్ 4వ తేదీ వరకూ ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌పై నిరుద్యోగ యువకులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 18 నుంచి 45 సంవత్సరాల్లోపు వయస్సు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు అర్హులు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి ఉంటుంది. పూర్తి వివరాలకు 94925 83434లో సంప్రదించవచ్చు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

అనంతపురం: డిప్లొమో కోర్సుల్లో అడ్మిషన్లకు నిర్వహిస్తున్న ఏపీ పాలిసెట్-2025కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సెట్ జిల్లా కోఆర్డినేటర్ సి.జయచంద్రా రెడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం 22 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతపురంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఉమెన్), ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాల (ఏ, బీ సెంటర్లు), ఓటీపీఆర్ఐ, ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల, కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్వీ డిగ్రీ కళాశాల, పీవీకేకే డిగ్రీ అండ్ పీజీ కళాశాల, తాడిపత్రి పట్టణంలో ఆరు సెంటర్లు, గుంతకల్లులో నాలుగు, కళ్యాణదుర్గంలో మూడు చొప్పున సెంటర్లు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలల్లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. 11 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. పాలిసెట్ హాల్‌టికెట్ రానివారు (ఫీజు చెల్లింపు వైఫల్యం, ఫీజు వాపసు కారణంగా) సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కో-ఆర్డినేటర్‌ను మంగళవారం సాయంత్రం 4 గంటల్లోపు సంప్రదించి, హాల్‌టికెట్లు పొందవచ్చు. రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకెళ్లాలి. ఆన్‌లైన్లో హాల్‌టికెట్ డౌన్ లోడ్ అయి ఉంటే హెల్ప్‌లైన్ సెంటర్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు.

నీటి తొట్టెలో పడి బాలుడి మృతి



హర్షవర్ధన్ మృతదేహం

బ్రహ్మసముద్రం : ప్రమాదవశాత్తు నీటి తొట్టెలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. బ్రహ్మసముద్రం మండలం ఎరడికెర గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు... ఎరడికెరకు చెందిన శివలింగమ్మ, నాగరాజు దంపతుల కుమారుడు హర్షవర్ధన్ (3) సోమవారం ఉదయం ఇంటి వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి తొట్టెలో పడిపోయాడు. ఆలస్యంగా గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే బాలుడిని నీటి నుంచి వెలికి తీసి బ్రహ్మసముద్రంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నారి మృతితో తల్లిదండ్రుల రోదనకు అంతు లేకుండాపోయింది.

వైస్ చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవం



అరుణ



షెక్షావలి

తాడిపత్రి రూరల్: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో సోమవారం నిర్వహించిన వైస్ చైర్మన్ల ఎంపిక సజావుగా ముగిసింది. ఎన్నికల ఆర్‌ఓ మల్లికార్జున ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఎన్నికలో టీడీపీకి చెందిన 26వ వార్డు కౌన్సిలర్ షెక్షావలి వైస్ చైర్మన్-1గా, సీపీఐకి చెందిన 12వ వార్డు కౌన్సిలర్ అరుణ వైస్ చైర్మన్-2గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని టీడీపీ కౌన్సిలర్లు మల్లికార్జున, విజయ్‌కుమార్, జింకా లక్ష్మీదేవి బలపరిచారు. నూతన వైస్ చైర్మన్లతో ఆర్‌ఓ ప్రమాణ స్వీకారం చేయించారు.

మద్యం షాపుల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం: ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న మద్యం షాపుల నిర్వహణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి. నాగమద్దయ్య, జిల్లా ఎక్సైజ్ అధికారి బి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తాడిపత్రి మున్సిపాలిటీ మూడు, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో ఒకటి చొప్పున షాపులు ఉన్నాయి. వీటికి సంబంధించి అనంతపురం జిల్లాలోని పది ఎక్సైజ్ స్టేషన్లలో ఎక్కడైనా దరఖాస్తులు అందజేయవచ్చు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలని మడకశిర నగర పంచాయతీ పరిధిలో రెండు, గుడిబండ మండలంలో ఒకటి, అమరాపురం మండలంలో ఒకటి చొప్పున ఖాళీగా ఉన్న మద్యం షాపుల నిర్వహణకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ జిల్లా పరిధిలోని 8 ఎక్సైజ్ స్టేషన్లలో ఎక్కడైనా దరఖాస్తులు అందజేయవచ్చు. రూ.2 లక్షల నాన్ రీఫండబుల్ దరఖాస్తు రుసుమును డీడీ ద్వారా చెల్లించాలి. అప్లికేషన్‌కు ఆధార్ కార్డు జత చేసి మే 3వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలి. అదే నెల 5న ఉదయం 8 గంటలకు లాటరీ ప్రక్రియ ద్వారా దుకాణాలను కేటాయిస్తారు.

తాగునీటి పథకం కార్మికుల గోడు పట్టని సీఎం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



పీఏబీఆర్ వద్ద పోస్టుకార్డు ఉద్యమం చేపట్టిన కార్మికులు

కూడేరు: తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల గోడు ముఖ్యమంత్రి చంద్రబాబుకు పట్టడం లేదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మండిపడ్డారు. బకాయి వేతనాలు, పీఎఫ్ చెల్లింపులు తక్షణమే చేయాలంటూ సోమవారం కూడేరు మండలం పీఏబీఆర్ వద్ద ఉన్న శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్ వద్ద కార్మికులు పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడారు. తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆరు నెలలుగా వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిన కార్మికులకు అండగా నిలవాలంటూ సీఎంకు పోస్టు కార్డులు రాసి పోస్టు చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి, కార్మికులు రామాంజనేయులు, కొండారెడ్డి,వన్నూరు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

యూపీ పాఠశాలల్లో పోస్టులు కేటాయించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: జీఓ 117 పునర్నిర్మాణ మేరకు ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యాశాఖ ప్రకటించిన విధి విధానాల ప్రకారం పోస్టులను కేటాయించాలని ప్రభుత్వాన్ని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఇందుకు విరుద్ధంగా జిల్లాలో పోస్టులను కేటాయిస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. విధి విధానాల ప్రకారం ప్రాథమికోన్నత పాఠశాలల్లో హిందీ, ఇంగ్లిష్, గణితం, బయాలజికల్ సైన్స్, సోషియల్, ఫిజికల్ సైన్స్, తెలుగు పోస్టులను కేటాయించాలన్నారు. అలా కాకుండా పోస్టులను కేటాయించారంటూ అసహనం వ్యక్తం చేశారు. రెండేళ్ల క్రితం ఆ పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు ప్రస్తుత చేపట్టబోయే బదిలీల్లో తీవ్రంగా నష్ట పోతారన్నారు. ఈ అంశాన్ని పునః పరిశీంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతమున్న పోస్టులతో పాటు అవసరం మేరకు ఇతర పోస్టులనూ కేటాయించాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో ఫ్యాప్టో సెక్రెటరీ జనరల్ పురుషోత్తం, కో చైర్మన్ ఓబులేసు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ గోవిందరాజులు, నీలూరు రమణారెడ్డి, కార్యదర్శులు వెంకటరత్నం, సిరాజుద్దీన్, సభ్యులు మల్లికార్జున, రామాంజనేయులు, గోపాల్ రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వేసవి శిబిరాలతో విజ్ఞానం



విద్యార్థులతో గేమ్స్ ఆడిస్తున్న గ్రంథాలయాధికారి వీరనారాయణ రెడ్డి

రాప్తాడు: వేసవి శిక్షణ శిబిరాల వల్ల విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయాధికారి వీరనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేసవి విజ్ఞాన శిబిరాల్లో పుస్తకాలు పఠనం, కథలు చెప్పడంతో పాటు విద్యార్థుల్లో సృజానాత్మకత పెంపొందించేలా డ్రాయింగ్, చెస్ తదితర ఆటలు పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం విద్యార్థులతో కథలు చెప్పించడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, చిత్ర లేఖనంతో పాటు వివిధ ఆటలు ఆడించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, బుల్లే నాగన్నతో పాటు పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు సామూహిక ఐశ్వర్యేశ్వర వ్రతం

అనంతపురం కల్చరల్: నగరంలోని హెచ్చెల్సీ కాలనీ శ్రీమంజునాథస్వామి ఆలయంలో బుధవారం ఉదయం ఆరు గంటల నుంచి సామూహిక ఐశ్వర్యేశ్వర వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి బసవరాజస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా ఆలయంలోని స్వర్ణలింగానికి సామూహిక రుద్రాభిషేకం, క్షీరాభిషేకం జరుగుతాయన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



పౌష్టికాహారం గురించి తెలియజేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి

కనగానపల్లి: గర్భిణులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి తెలిపారు. సోమవారం కనగానపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతో సమావేశం ఏర్పాటు చేసి పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. గర్భధారణ మొదలు పిల్లలకు రెండేళ్ల వయస్సు వచ్చేవరకూ తీసుకోవలసిన ఆహార పదార్థాలు, నియమాలు గురించి సూపర్‌వైజర్ మహిళలకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహార పదార్థాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మహిళలు పాల్గొన్నారు.

'పహల్గాం' దోషులను కఠినంగా శిక్షించాలి

అనంతపురం టవర్‌క్లాక్: పహల్గాం ఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పెద్దన్న గౌడు అన్నారు. సోమవారం పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నగరంలోని ఎన్జీవో హోం నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి.. అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెద్దన్న గౌడ్ మాట్లాడుతూ అమాయకులను బలితీసుకున్న టెర్రరిస్టులు ఎక్కడ దాక్కున్నా వెతికి పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జయరామప్ప, గోవింద రాజులు, రవీంద్ర, ప్రభాకర్, చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి



గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న సిబ్బంది, గ్రామస్తులు

కనగానపల్లి: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని మండల గ్రంథాలయాధికారి గోవిందు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. 40 రోజుల పాటు జరిగే వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు పుస్తకం పఠనం, డ్రాయింగ్, యోగాతో పాటు చెస్, క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్‌పై కూడా శిక్షణ ఇస్తామని గ్రంథాలయ సిబ్బంది తెలిపారు.

'ఉపాధి' అధికారులతో కూలీల వాగ్వాదం

కూడేరు: ఉపాధి పనులు కల్పించలేదని కడదరకుంటకు చెందిన కూలీలు అధికారులతో సోమవారం వాగ్వాదానికి దిగారు. కొద్ది రోజులుగా పనులు కల్పించాలని కోరుతున్నా సిబ్బంది పట్టించుకోకపోతే ఎలా? అని ఏపీఓ పోలేరయ్యను ప్రశ్నించారు. పనులు కల్పించకపోవడంతో గ్రామంలో చాలా మంది కూలీలు ఉరవకొండ మండలంలో బ్యాడిగి మిర్చి తొలగించేందుకు వెళ్తున్నారన్నారు. తప్పకుండా పనులు కల్పిస్తామని ఏపీఓ హామీ ఇవ్వడంతో కూలీలు వెనుదిరిగారు.

ఎల్లలు దాటిన 'అనంత' నృత్యం

- అనంత నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన నృత్యకారులు
- దేశ విదేశాల్లో ప్రత్యేక ప్రదర్శనలు

: సందర్భం:
నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం

అనంతపురం కల్చరల్: కళలకు కరువు లేని అనంత సీమలో ఎందరో కళాకారులు తమ ప్రతిభా పాటవాలను ఘనంగా చాటుతూ జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలు దాటించారు. శాస్త్రీయ, జానపద, వెస్ట్రన్ నాట్యాలతో అందరిని మంత్రముగ్ధులను చేశారు. భారతీయ సంప్రదాయ నృత్యకళ విశిష్టతను చాటేలా ప్రతి ఏడాది ఏప్రిల్ 29న 'అంతర్జాతీయ నృత్య దినోత్సవం'గా జరుపుకుంటున్నాము.

అనంత ఖ్యాతి చాటి చెప్పేలా..

'అనంత' నాట్యం పేరు వినగానే శాస్త్రీయ నృత్యానికి పునాదులేసిన వరదరాజ అయ్యంగార్, అప్పారావు, కృష్ణకుమార్ వంటి డాన్సు మాస్టర్లు తొలిరోజుల్లో జిల్లా కేంద్రంలో అద్భుతమైన కళాకారులను తీర్చిదిద్దారు. అనంతరం ప్రముఖ నాట్యాచార్యులుగా రాణిస్తున్న సంధ్యామూర్తి నృత్యకళానిలయం స్థాపించి దేశ విదేశాలలో అనంత నాట్యాన్ని పరిచయం చేశారు. దుబాయ్, సింగపూర్, మలేషియా వంటి విదేశీ వేదికలపై ఆమె ప్రతిభను చాటుకున్నారు. ప్రతి సంవత్సరం సంధ్యారవళి పేరుతో దేశంలో పేరుగాంచిన కళాకారులతో కలిసి ప్రదర్శనలిచ్చేలా కృషి చేస్తున్నారు. అలాగే మరో నాట్య విద్వాంసుడు పట్నం శివప్రసాద్ చిరుప్రాయం నుంచే సంధ్యామూర్తి వద్ద నాట్యకళను అభ్యసించి జాతీయ స్థాయిలో అన్ని ప్రధాన వేదికలపై జిల్లా ఖ్యాతిని ఘనంగా చాటిచెప్పారు. ఆయన శిష్యుడు సోమనాథ భరద్వాజ్ సంప్రదాయ కూచిపూడి నాట్యంలో అనేక అవార్డులు, రివార్డులు సాధిస్తున్నారు. అరుదైన కళాకారులకందించే కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్పులకు అర్హత సాధించాడు. అలాగే కృష్ణమూర్తి రాజు, సురేష్ మాస్టర్, పద్మావతి వంటి శాస్త్రీయ నాట్యకళాకారులే కాకుండా వెస్ట్రన్, ఫోక్ స్టైల్‌లో రాణిస్తున్న కత్తి విజయ్‌కుమార్, మక్బుల్‌బాషా, విష్ణు, వన్నూరు, హరిప్రసాద్, రమేష్ వంటి వారు ట్రెండింగ్ డాన్స్ స్టైల్స్‌కు ప్రత్యేక గుర్తింపు తెస్తున్నారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా నగరంలో పలుచోట్ల నాట్య ప్రదర్శనలు కనులవిందుగా జరగనున్నాయి. మంగళవారం వేర్వేరు వేదికలపై కళాకారులు అద్భుత నృత్యప్రదర్శనలతో అలరించనున్నారు.



ఓ వేదికపై అనంత కళాకారుల నృత్య ప్రదర్శన (ఫైల్)

కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో తనిఖీలు

అనంతపురం సెంట్రల్: నగరంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలను సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగమణి ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల విద్యార్థినులపై ఎలుకల దాడి చేసిన విషయం తెలిసిందే. దీంతో వాస్తవ పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో తనిఖీ చేపట్టినట్లు నాగమణి వివరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను పీడీకి విద్యార్థినులు విన్నవించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని వాపోయారు. దీనికి తోడు ఒక్కో గదిలో 15 మందిని ఉంచుతున్నారని, మరుగుదొడ్లు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయని ఫిర్యాదు చేశారు. స్టోర్ రూం, వంట గదులు అపరిశుభ్రంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓలు లలిత, ధనలక్ష్మి, వసతిగృహం అధికారులు పాల్గొన్నారు.



భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ నాగమణి

టాటాతో కలిసి పనిచేయడం గర్వకారణం

- సంసిధ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఫౌండర్ చైర్మన్ వాసా శ్రీనివాసరావు

అనంతపురం ఎడ్యుకేషన్: టాటా క్లాస్ ఎడ్జ్‌తో కలిసి పనిచేయడం గర్వకారణమని, చిన్నారులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో తమ సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని సంసిధ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఫౌండర్, చైర్మన్ వాసా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సాయంత్రం నగరంలోని ఓ హోటల్లో సంసిధ్ ఇంటర్నేషనల్ స్కూలు ఆధ్వర్యంలో నిర్వహించిన టాటా క్లాస్ ఎడ్జ్ ప్రోగ్రామ్‌ను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతతో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పాఠశాల సీఈఓ ఇందు సానో, అజ్వాస డైరెక్టర్లు చైతన్య సిద్ధార్థ వాసా, గోవిందు, డిస్కవర్ అనిల్, రచయిత్రి చిలుకూరి దీవెన హాజరయ్యారు. దేశవ్యాప్తంగా 15 శాఖలు కలిగి, 15 వేలమందికి పైగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న సంసిధ్ ఇంటర్నేషనల్ స్కూలు టాటా సంస్థతో కలసి పనిచేయడానికి జాతీయ స్థాయిలో ఒప్పందం చేసుకుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టాటా క్లాస్ ఎడ్జ్ లిమిటెడ్ చైర్మన్ కేఆర్ఎస్ జంవాల్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సంసిధ్ స్కూల్ నిర్వాహకులు

'శ్రీరామరెడ్డి' కార్మికుల సమస్య పరిష్కరించండి

- కలెక్టర్‌కు ప్రజాసంఘాల నాయకుల వినతి

అనంతపురం అర్బన్: శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికుల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు విన్నవించారు. కలెక్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, వేదిక నాయకులు కలిసి వినతిపత్రం అందజేసి సమస్య వివరించారు. వేతనాలు, బకాయిల కోసం 24 రోజులుగా పథకం కార్మికులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. దీంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు నాగేంద్ర కుమార్, బాలరంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేష్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఇతర నాయకులు

ఎల్ఆర్‌జీ విద్యార్థులకు మేయర్ అభినందన

రాప్తాడు: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రసన్నాయపల్లిలోని ఎల్ఆర్‌జీ ఇంగ్లిష్ మీడియం విద్యార్థులను అనంతపురం మేయర్ వసీం సలీమ్ అభినందించారు. శాలువ, పూలమాలలతో సన్మానించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... విలువలతో కూడిన విద్య అందించడంలో ఎల్ఆర్‌జీ పాఠశాల ముందు వరసలో ఉంటుందన్నారు. పది ఫలితాల్లో పాఠశాల మండలంలో మొదటి స్థానంలో రావడం గర్వకారణమన్నారు. పాఠశాలకు చెందిన 86 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 85 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కావడం గొప్ప విషయమన్నారు. గతంలో ఇక్కడ చదివిన వారు నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు రాణించాలని సూచించారు. తానుకూడా ఇదే పాఠశాలలో పదో తరగతి వరకూ చదువుకున్నానని తెలిపారు. పాఠశాలలో జరిగే కార్యక్రమానికే ముఖ్య అతిథిగా హాజరవుతానని కలలో కూడా అనుకోలేదన్నారు. ఇలాంటి కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బొంతు ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



'పది'లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం సలీమ్

ఆర్డీటీని సమైక్యంగా కాపాడుకుందాం

అనంతపురం అర్బన్: పేదల పెన్నిధిగా ఉన్న ఆర్డీటీ సంస్థను సమైక్యంగా కాపాడుకుందామని ఎస్సీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ సమీపంలోని ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ జిల్లాలో 1969 నుంచి ఇప్పటి వరకు సేవలందిస్తోందన్నారు. ఇలాంటి సంస్థను కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేయడాన్ని నిరసిస్తున్నామన్నారు. తక్షణమే ఎఫ్‌సీఆర్ఏకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని ప్రజాసంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నెరెమెట్ల ఎల్లన్న, సాకే చిరంజీవి, ఎంఎస్ఎఫ్ నాయకులు నగేష్, జై భీమ్ రామాంజినేయులు, రాష్ట్ర అధ్యక్షుడు పామిడి ఓబులేసు, ఎరుకల యువ సైన్యం నాయకుడు పోలావీర, ఎస్సీ, ఎస్టీ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీనుగ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎస్సీ సంఘాల నాయకులు

డీఎస్సీ స్టడీ మెటీరియల్ వితరణ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో డీఎస్సీకి సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఉపయుక్తమయ్యే పుస్తకాలను మాజీ రిజిస్ట్రార్ సుధాకర్ బాబు వర్సిటీ కేంద్ర గ్రంథాలయానికి ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత చేతుల మీదుగా అందజేశారు. రూ.16 వేలు విలువ చేసే మెటీరియల్ వితరణ చేశారు. పోటీ పరీక్షల సెల్‌లో ఈ పుస్తకాలు అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ వెంకట నాయుడు, రిజిస్ట్రార్ రమేష్ బాబు, లైబ్రరీ సైన్సెస్ విభాగాధిపతి ప్రొఫెసర్ దాశరథి రవీంద్ర, లైబ్రరీ అధికారులు రామసుబ్బయ్య, ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను చూపుతున్న వీసీ ప్రొఫెసర్ బి.అనిత, మాజీ రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు

ఆర్డీటీని కాపాడుకుందాం

అనంతపురం: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ పునరుద్ధరించే వరకు విశ్రమించేది లేదని పలువురు వక్తలు అన్నారు. 'సేవ్ ఆర్డీటీ' నినాదంతో నగరంలోని డ్రైవర్స్ కాలనీలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం పార్టీలకు అతీతంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.ప్రభాకర్ చౌదరి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్, ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగా రెడ్డి, మాజీ మేయర్ స్వరూప, టౌన్ బ్యాంకు అధ్యక్షుడు మురళి, కార్పొరేటర్ రహంతుల్లా , సీసీఎల్ చైర్మన్ షకీల్ షఫీ, నగరంలోని ముతవల్లీలు, ఇమామ్‌లు, ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు. సేవ్ ఆర్డీటీ కమిటీని ఏర్పాటు చేసుకుని.. రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రిని కలిసి విన్నవించాలని తీర్మానించారు.



సేవ్ ఆర్డీటీ నినాదం చేస్తున్న వక్తలు

'ఇండియా డిజైన్ వీక్'లో ప్రతిభ

గుత్తి: తమిళనాడు రాష్ట్రం చెన్నైలో గత ఆదివారం ఇండియాడిజైన్ వీక్ 2025(సౌత్ ఇండియా రీజియన్) గ్రాండ్ ఫైనల్స్‌లో గేట్స్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు బాల ఆదిత్య, మహ్మద్ సొహెల్, విశ్వనాథ్, జగన్‌మోహన్ బెస్ట్ డిజైన్ అవార్డును సొంతం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు ప్రదర్శనకు వేదికైన ఇండియా డిజైన్ వీక్ 2025 కార్యక్రమానికి దక్షిణ భారతదేశంలోని అనేక మంది ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరిచిన గేట్స్ విద్యార్థులకు సోమవారం గేట్స్ కాలేజీలో అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎండీ రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తన్వీర్, మెకానికల్ హెచ్ఓడీ డాక్టర్ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభావంతులను అభినందిస్తున్న 'గేట్స్' యాజమాన్యం

దత్తాత్రేయ పునః ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం

అనంతపురం కల్చరల్: గణపతి సచ్చిదానంద స్వామీజీ నేతృత్వంలో దత్తాత్రేయ పునః ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్థానిక జెడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న దత్తమందిరంలో ప్రతిష్టాయాగం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, దీక్షాహోమం, ద్వారతోరణ పూజలు, వాస్తు హోమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేదపండితులు యజ్ఞహోమాలను జరిపించారు. మధ్యాహ్నం పూర్ణాహుతి ఇచ్చారు. ఈ నెల 30 వరకు విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమాలు కొనసాగుతాయని ఆలయ ప్రతినిధి శర్మ తెలిపారు. మంగళవారం మైసూరు దత్తపీఠం నుంచి ఉత్తరాధికారి బాలస్వామి శ్రీదత్తవిజయానంద తీర్థులు విచ్చేస్తారన్నారు.

లఘుచిత్రంగా 'అనంతపురం చరిత్ర'

అనంతపురం కల్చరల్: సీనియర్ రచయిత గిరిధరప్రసాద్ రాయ్ 'అనంత' చరిత్రను శోధించి రచించుకోవడమే కాకుండా స్వీయదర్శకత్వంలో నిర్మించిన లఘుచిత్రం చివరి షెడ్యూల్ షూటింగ్ సోమవారం పూర్తయింది. ఈ సందర్భంగా గిరిధరప్రసాద్ రాయ్ మాట్లాడుతూ టిప్పు సుల్తాన్ కాలంలో అనంతపై దండెత్తిన సన్నివేశం, దానిని ఎదుర్కొన్న రుద్రప్ప అనే వీరుడి కథతో ప్రారంభమై నేటి సైనికుల జీవిత విశేషాలతో ముగుస్తుందని చిత్రకథను క్లుప్తంగా వివరించారు. సీనియర్ నటుడు రమేష్ నీల్, చరణ్, దండు హరి, నిఖిల్, శాషా తదితరులు నటించారన్నారు. లఘుచిత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు.

2 నుంచి కిశోరి వికాసంపై కార్యక్రమాలు

అనంతపురం సెంట్రల్: 'కిశోరి వికాసం'లో భాగంగా యుక్త వయస్సు బాలికల సంక్షేమం కోసం సమ్మర్ క్యాలెండర్ ప్రోగ్రాంలు అన్ని సచివాయాల పరిధిలో మే 2 నుంచి షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ లలిత ఒక ప్రకటనలో ఆదేశించారు. అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు, కమిటీ సభ్యుల సహకారంతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

పన్ను రాయితీకి రేపటి వరకే గడువు

అనంతపురం కార్పొరేషన్: పన్ను రాయితీకి ఈ నెల 30 వరకే గడువు ఉందని, ఈ ఏడాది ఆస్తి పన్నును ఒకేసారి చెల్లించి 50 శాతం రాయితీ పొందాలని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌంటర్లతో పాటు వేణుగోపాల్‌నగర్ 5వ సచివాలయం, పాతూరు 17వ సచివాలయం, నవోదయ కాలనీ 40 సచివాలయం, శ్రీనగర్ కాలనీలోని 52వ సచివాలయం, రెండో రోడ్డు స్టడీ పార్క్ పక్కన ఉన్న 64వ సచివాలయంలో పన్ను చెల్లించవచ్చునని తెలిపారు.

యోగాసన పోటీలకు శిక్షణ

అనంతపురం కల్చరల్: జిల్లా యోగాసన అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి తెలిపారు. తొమ్మిదేళ్ల నుంచి 20 ఏళ్లలోపు బాలబాలికలకు వేసవి సెలవుల్లో 40 రోజుల పాటు యోగా శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. నగరంలోని షిర్డీనగర్, రామనగర్, సోమనాథనగర్, కోర్టురోడ్డు, సంగమేష్ నగర్, కొవ్వూరు నగర్, మొదటిరోడ్డులలో శిక్షణ ఇస్తారని, 94412 52258, 93939 38449 నంబర్లలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

అనంతలో బీసీ గురుకులాల కార్యాలయం ఏర్పాటు చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్ కార్యాలయం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సమైక్య నాయకుడు సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో అత్యధికంగా బీసీలు ఉన్నారన్నారు. బీసీ గురుకులాలకు సంబంధించిన కార్యాలయం అనంతపురం నగరంలో లేదన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు సరైన సమాచారం లేక చాలామంది నష్టపోతున్నారన్నారు. కావున బీసీ గురుకులాలకు సంబంధించిన డీసీఓ కార్యాలయం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో విద్యార్థి నాయకులు రమేష్, లోహిత్, రాజు, దిలీప్ ఉన్నారు.

అక్రమ నిర్మాణాన్ని ఆపండి

కనగానపల్లి: మండల పరిధిలోని గుంతపల్లి గ్రామంలో ప్రధాన వీధిలో రహదారి పక్కన అక్రమంగా నిర్మిస్తున్న మరుగుదొడ్డిని ఆపాలని స్థానికులు కోరారు. ఈమేరకు సోమవారం బయపరెడ్డి, చెన్నారెడ్డితో పాటు పలువురు గ్రామస్తులు జిల్లా కేంద్రం పుట్టపర్తిలో జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నరసింహులు వారి ఇంటి పక్కన ప్రధాన రహదారిలో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకుంటున్నాడని దీనివల్ల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. ఇదే విషయమైన వారం రోజుల క్రితం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కలెక్టర్‌కు విన్నివించారు. దీనిపై ఎంపీడీఓ అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా... గ్రామస్తులు ఫిర్యాదు మేరకు నాలుగు రోజుల క్రితం గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టామన్నారు. రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి నిర్మాణం తొలగించాలని నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

కేఎస్ఎన్ కళాశాలను పరిశీలించిన ఎమ్మెల్యే

అనంతపురం ఎడ్యుకేషన్: నగర శివారులోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సోమవారం సందర్శించారు. ఇటీవల కళాశాల హాస్టల్ గదుల్లోకి ఎలుకలు ప్రవేశించి, కొందరి విద్యార్థినులకు గాయాలు చేసిన విషయంపై ఆరా తీశారు. కళాశాల ఆవరణ, వసతిగృహం చుట్టు పక్కల ప్రాంతాలను పరిశీలించారు. ఒక్కో గదిలో 20 మంది ఉంటున్నామంటూ విద్యార్థినులు వాపోయారు. హాస్టల్‌లో తాగునీటి పైప్‌లైన్ సమస్య ఉందని తెలిపారు. మునిసిపల్ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రసాద్ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కుకింగ్ రూమ్‌లో అపరిశుభ్రతపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ఉంటే పిల్లల ఆరోగ్యాలు ఏమవుతాయని ప్రశ్నించారు.

శభాష్..బాగా పని చేశారు



ఆఫీస్ సూపరింటెండెంట్ రమణకు మెమొంటోను అందజేస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్‌లో 884 మందికి విజయవంతంగా సేవలు అందించామని, ఇందులో సంబంధిత వైద్యులు, మినిస్టీరియల్ స్టాఫ్ బాగా పనిచేశారని, ఇదే స్ఫూర్తితో ముందు సేవలందించాలని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి సూచించారు. సోమవారం సర్వజనాస్పత్రిలో మినిస్టీరియల్ స్టాఫ్‌ను వారు అభినందిస్తూ మెమొంటోలు అందజేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ కుళ్లాయస్వామి, ఏఓ రవీంద్ర కుమార్, సూపరింటెండెంట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు నష్టం



దాదులూరు కొట్టాల దగ్గర గాలివానకు నేలకొరిగిన మొక్కజొన్న పంట

కనగానపల్లి: వాతావరణ మార్పులతో ఆదివారం రాత్రి కురిసిన గాలీవానకు పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. దాదులూరు కొట్టాల గ్రామంలో మూడు ఎకరాల్లో మొక్కజొన్న కిందకు వాలిపోయింది. కంకి దశలోఉన్న పంట నేలకొరగడంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని, దీనివల్ల రూ.లక్షకుపైగా పంట నష్టం వాటిల్లినట్లు రైతు హరికుమార్ తెలిపారు. ఇక ముక్తాపురం, మామిళ్లపల్లి, కుర్లపల్లి గ్రామాల పరిధిలోని సుమారు 15 ఎకరాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. అధికారులు పంటలను పరిశీలించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నత స్థాయికి చేరి ఆదర్శంగా నిలవాలి



విద్యార్థులను సన్మానిస్తున్న అధికారులు

ఆత్మకూరు: పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఎంఈఓ నరసింహారెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన భార్గవి (584), ముల్లా సమీహ (565),హి బాబా ఫకృద్దీన్ (559), శ్రీలిఖిత (557), షాహీర్ (554)ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంఈఓ మాట్లాడుతూ... ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు రాణించడం శుభపరిణామమన్నారు. భవిష్యత్‌లోనూ బాగా చదివి తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, తహసీల్దార్ లక్ష్మీనాయక్, కేజీబీవీ ఎస్ఓ లీమారోజ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.